క్లుప్తంగా

గంగాలమ్మ విగ్రహం వితరణ



అమ్మవారి విగ్రహాన్ని అందజేస్తున్న వెంకటరామయ్య

అడ్డతీగల: గంగవరం మండలం బ్రిమామిడి గ్రామస్తులకు శనివారం గంగాలమ్మ తల్లి రాతి విగ్రహాన్ని పవనగిరి ట్రస్ట్ వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య అందజేశారు. గంగాలమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన రాతి విగ్రహాన్ని ఇప్పించాలని గ్రామస్తులు కోరిక మేరకు వితరణగా ఇచ్చారు. శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించి అమ్మవారికి పూజాదికాలు చేయించి అన్నసమారాధన నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



సరస్వతిదేవికి పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: బడదనాంపల్లి పంచాయతీ కొత్తవీధిలో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఇక్కడ గిరిజనులు సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుని నాలుగు వసంతాలు గడచిన నేపథ్యంలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి నుంచి గ్రామస్తులంతా భజనలు, నృత్యాలతో సందడి చేశారు. గ్రామపెద్దలు దొడ్డంరెడ్డి శ్రీరాములు (పూజారి), గ్రామపెద్దలు సరస్వతీ దేవి విగ్రహాన్ని నెలకొల్పారు. దేవికి అష్టోత్తర నామాలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు ప్రారంభం



ఆపరేషన్లు చేస్తున్న వైద్యులు

ఎటపాక: గౌరీదేవిపేట పీహెచ్‌సీలో కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇక్కడ సిబ్బంది, వైద్యుల కొరత కారణంగా 13 ఏళ్లుగా ఈ సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ పరిధి భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయించుకునేవారు. ఈ క్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు టి.వి. శేషిరెడ్డి ప్రత్యేక చొరవతో శనివారం ఏడుగురికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేశారు. ఎనిమిది గ్రామ సచివాలయాల ప్రజలకు వారంలో రెండు మార్లు ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ తెలిపారు. వైద్యులు దేవనాగ్, హెచ్‌వీలు వాణి, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

హుకుంపేట: గిరిజనులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తెలిపారు. హుకుంపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గొల్లోరి బాబూరావు కుటుంబాన్ని ఆమె శనివారం పరామర్శించారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 అందించారు. మిగిలిన రూ.90 వ ఏలు నామినీ ఖాతాలో జమ కానుందన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, నాయకులు అనిల్, సూరిబాబు పాల్గొన్నారు.

రేపు కవయిత్రి మొల్ల జయంతి

అనకాపల్లిటౌన్: ఉమ్మడి విశాఖ జిల్లాలో కుమ్మరి శాలివాహన కవయిత్రి మొల్ల జయంతిని ఈ నెల 13న ఘనంగా నిర్వహించనున్నామని జిల్లా కుమ్మరి శాలివాహన డైరెక్టర్ అర్జున వెంకటరావు శనివారం పేర్కొన్నారు. ప్రతి మండలంలో నిర్వహించాలని కోరారు.

గిరిజన రైతుల సమస్యలను పరిష్కరించాలి

చింతూరు: పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం అటవీ ఉత్పత్తుల ధరలు పెంచాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన చింతూరులో మాట్లాడుతూ కొండచీపుర్లు గ్రేడింగ్ చేయకుండా ఒకే ధరకు కొనుగోలు చేయాలన్నారు. అటవీ ఉత్పత్తులు సేకరించే సమయంలో ప్రమాదం జరిగి మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. భూమి అభివృద్ధి చేసుకునేందుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



సిద్ధమైన పోలింగ్ కేంద్రం

చింతపల్లి రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్లిప్పులు సిద్ధం చేసి ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1,090 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో కృష్ణారావు, ఉపాధ్యాయుడు గిరి పాల్గొన్నారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేశారు. మండలంలో 647 మంది పట్టభద్రుల ఓటర్లు ఓట్లు వేయనున్నారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు తిరుమలరావు శనివారం పరిశీలించారు. సిబ్బందికి కొన్ని అంశాలపై ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 13న పోలింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 164వ కేంద్రంగా ఇది ఉంటుందన్నారు.



ఓటర్లకు స్లిప్పులు అందజేస్తున్న దృశ్యం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరూ అతిక్రమించినా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

హుకుంపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నియమావళి అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల పోలింగ్ కేంద్రంలో 144 సెక్షన్ విధించామన్నారు. 200 మీటర్ల దూరంలో ఇతరులు, పార్టీ నేతలు ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తప్ప ఇతరులకు ప్రవేశం లేదన్నారు.

మహిళల రక్షణకు కృషి చేయాలి

అరకు రైల్వే ఆర్పీఎఫ్ సీఐ మహేష్



మహిళలతో కేక్ కట్ చేస్తున్న సీఐ మహేష్

అరకులోయ రూరల్: మహిళల రక్షణకు అందరూ కృషి చేయాలని అరకు రైల్వే ఆర్పీఎఫ్ సీఐ మహేష్ తెలిపారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక యండపల్లివలస రైల్వే స్టేషన్ ఆవరణలో శనివారం మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అక్రమ దాడులను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలన్నారు. హక్కులు, చట్టాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్పీఎఫ్ ఏఎస్ఐ మోహన్, సిబ్బంది రవికుమార్, అప్పారావు, భానుప్రకాష్, చైతు, మహిళలు విజయలక్ష్మి, సనమ్మ, రాధిక, జ్యోతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సోమనాథ్‌ను ఓదారుస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

ముంచంగిపుట్టు: పెదగూడ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గొల్లోరి సోమనాథ్ భార్య దాలిమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం సోమనాథ్‌ను పరామర్శించి ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దాలిమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్లు బాబూరావు, రమేష్, ఎంపీటీసీలు గణపతి, మల్లికార్జున్, మండల నేతలు జగబంధు, జయదేవ్, కొండలరావు, సన్యాసిరావు, తిరుపతి, భాగత్‌రామ్, సాధురాం పాల్గొన్నారు.

బొడ్లగొందిలో శాశ్వత భూహక్కు సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రాజవొమ్మంగి: బొడ్లగొంది గ్రామానికి చెందిన 250 ఎకరాల్లో శాశ్వత భూహక్కు సర్వే రెండు రోజులుగా ఊపందుకుంది. ఈ సర్వే మరో నాలుగు రోజులు ఉంటుందని డీటీ సత్యనారాయణ, వీఆర్వో ద్రాక్షాయని తెలిపారు. మండలంలో ప్రయోగాత్మకంగా (మొదటి విడతగా) సర్వే ఇప్పటికే జీలుగులపాడు, చెరకుంపాలెం, కిమ్మిలిగెడ్డ, వయ్యేడు, పెద గర్రంగి, సుబ్బంపాడు గ్రామాల్లోని రెండు వేల ఎకరాల్లో సర్వే పూర్తయ్యిందని పేర్కొన్నారు. ఇదే పంథాలో ప్రతి గ్రామంలో పట్టాదారు రైతులకు వారి సాగు భూములపై శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు సర్వే పక్కాగా జరుగుతోందన్నారు. ఇందుకు జీపీఎస్ రోవర్ తదితర యంత్రాలను, టేపులను ఉపయోగిస్తున్నామన్నారు. సర్వే టీం సభ్యులు గుడివాడ పవన్‌కుమార్, జి. రాజ్‌కుమార్, పల్లాల విశ్వమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

రాజవొమ్మంగి: సిటీ హాస్పిటల్ (కాకినాడ) సౌజన్యంతో దూసరపాము గ్రామంలో శనివారం ఏర్పాటైన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కల్వరి గ్రేస్‌చర్చి పాస్టర్ సుధాకర్ సారధ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 150 మంది రోగులకు వైద్య నిపుణులు చినబాబు సేవలందజేశారు. ఆర్థోపెడిక్, గైనకాలజీ, యూరాలజీ సమస్యలున్న రోగులకు పరీక్షించి రోగ నిర్ధారణ చేశారు. మెరుగైన చికిత్స కోసం సిటీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. సర్పంచ్ చీడి శివ, గ్రామ పెద్దలు మంతెన జెమిని, ముసలయ్య, జ్యోతిరాజు, సత్యనారాయణ, రాంబాబు పర్యవేక్షించారు. అంజు ఇంటర్నేషనల్ ఐ కేర్ ఫెడరేషన్ (కాకినాడ) ఆధ్వర్యంలో రాజవొమ్మంగి ఎంపీపీ పాఠశాలలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిస్ట్ తేజ 150 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు. మేనేజర్లు స్వామి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి రాసకొండ బాల చెల్లమ్మ మహోత్సవాలు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి, మద్దిగరువు గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు రాసకొండ బాల చెల్లమ్మ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నాయకులు తెలిపారు. మునసాబ్ కొలకాని సుందరరావు జ్ఞాపకార్థంగా ఈ నెల11 నుంచి 22వ తేదీ వరకు డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 16లోగా ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించి తమ పేర్లను సర్పంచ్ ఎల్. మాలన్న, పి. రామన్న 9492527798, 8639148362 నమోదు చేసుకోవాలని కోరారు. వాలీబాల్ క్రీడల్లో విజేత జట్టుకు రూ.20,016, ద్వితీయ బహుమతిగా రూ.10,016 షీల్డులు ప్రదానం చేస్తామన్నారు. ఉత్సవాలు ముగింపు రోజున ముఖ్య అతిథులుగా ఏపీ ఎస్టీ సెల్ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీపీ కొర్రా పద్మ, జనసేన అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య విచ్చేస్తారన్నారు.

కానుగ పిక్కల సేకరణ



కానుగ పిక్కలను సేకరిస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మన్యంలో మార్చి వస్తే చాలు గిరిజనులందరూ కానుగ పిక్కల సేకరణ ముమ్మరం చేస్తుంటారు. అరకు–పాడేరు ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా చెట్లకు కాపు బాగా కాసింది. దాంతో రైతుల చూపు అటు వైపే ఉంది. వీటిని సేకరించి బాగా ఆరబెట్టి నూనె తయారు చేస్తారు. ఆ తర్వాత వారపు సంతల్లో విక్రయిస్తారు. కొంతమంది పిక్కలను విక్రయిస్తారు. వారపు సంతల్లో గతేడాది కిలో కానుగ పిక్కలు రూ.28 నుంచి రూ.30 వరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాదిలో అధిక ధర వస్తుందని ఆశిస్తున్నారు.

కూరగాయల సాగుపై రైతుల దృష్టి



గిరిజన రైతులు సాగు చేసిన ఉల్లికాడలు

డుంబ్రిగుడ: రబీ సీజన్‌లో బీడు భూములను ఖాళీగా విడిచి పెట్టకుండా కూరగాయల సాగుపైనే గిరిజన రైతులు దృష్టి పెడుతున్నారు. మండలంలోని బెడ్డగుడ, బైలుగుడ, జాముగుడ, బొందుగుడ, జాకరవలస, దేముడువలస, సొవ్వా, కంద్రుం, సొర్రాయి, మాలివలస, కితలంగి, కొర్రాయి, కోల్లాపుట్టు తదితర గ్రామాల్లో అధికంగా పండిస్తున్నారు. ఎక్కువగా సేంద్రియ ఎరువులతో కూరకాయలను సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 260 ఎకరాల బంగాళదుంపలు, 220 ఎకరాల ఉల్లి సాగు, 100 ఎకరాల క్యాబేజీ సాగు చేస్తున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటలకు సరైన ధర లేకపోవడంతోనే నష్టపోతున్నారు. ఇక్కడి వ్యవసాయ, హార్టికల్చర్ అధికారుల సలహాలు లేకుండానే కూరగాయలను సాగు చేస్తున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు అందిస్తే బీడు భూముల్లో సిరులు పండిస్తామని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రోత్సహించి ఐటీడీఏ ద్వారా సబ్సిడీపై ఆయిల్ ఇంజిన్లు పంపిణీ చేస్తే మరింత ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తామని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

15న ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

చోడవరం రూరల్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 15న వేలం వేయనున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జోగమ్మ తెలిపారు. శనివారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో చోడవరం స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలను వేలం వేయాల్సిందిగా అనకాపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెలకట్టిన ధర ప్రకారం వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు ఈ నెల 14వ తేదీన తమ ఆధార్, పాన్‌కార్డుల జెరాక్సులతో పాటు ఐదు వేల రూపాయల ధరావతు రుసుము చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.చంద్రశేఖర్‌ను 9346755223, 9440902385 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

రైవాడ జలాశయం సందర్శన

దేవరాపల్లి: సీపీఎం రాష్ట్ర నాయకులు రైవాడ జలాశయాన్ని శనివారం సందర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ప్రాజెక్టును పరిశీలించారు. అనకాపల్లి జిల్లాలోని మాడుగుల నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు పుష్కలంగా ఉన్నాయన్నారు. వీటిలో కీలకమైన రైవాడ ప్రాజెక్టు వేలాది ఎకరాల ఆయుకట్టుకు సాగునీటితో పాటు విశాఖ వాసులకు తాగునీటిని అందిస్తుందన్నారు. ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలన్నారు.

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు

మానసిక వైద్య నిపుణుడు రాజు



మాట్లాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రి మానసిక వైద్య నిపుణుడు రాజు

సాక్షి,పాడేరు: విద్యార్థులు ఇష్టపడి చదివితే సత్ఫలితాలు వస్తాయని పాడేరు జిల్లా ఆస్పత్రి మానసిక వైద్య నిపుణుడు, మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పరీక్షల్లో మంచి ఫలితాలు–మార్గాలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదితోపాటు, ఇంటర్ విద్యార్థులంతా భయం, మానసిక వత్తిడికి గురికాకుండా ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. చదవడం, రాయడంతోపాటు ఆటలు ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో పేదరికాన్ని జయించాలంటే ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నారు. చదువులు మధ్యలోనే మానేసి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. జిల్లాలో టెన్త్, ఇంటర్ విద్యార్థులంతా పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.చిన్నారావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నతోద్యోగాలు సాధించాలంటే టెన్త్, ఇంటర్ పరీక్షలు కీలకమన్నారు. బాగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు నరేష్, వరహాలు, మాణిక్యం, మత్స్యరాజులు పాల్గొన్నారు.

అనిగేరులో 80 మందికి వైద్య పరీక్షలు



ముంచంగిపుట్టు: కుమ్మరిపుట్టులో రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శిరీష, వైద్య సిబ్బంది

అడ్డతీగల: అనిగేరులో ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి రక్త పరీక్షలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చేతులు ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకుని ఆహారం తీసుకోవడం వల్ల చాలా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని గిరిజనులకు వైద్యాధికారి భాస్కర్ సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ వెంకట్, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం తులసి, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: కిలగాడ పీహెచ్‌సీ పరిధి సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టులో దీర్ఘకాలిక రోగులకు ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ శిరీష, వైద్య సిబ్బంది శనివారం 126 మందికి వైద్య సేవలు అందించారు. బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. హెచ్‌బీ పరీక్షలు చేసి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలందించారు. టీబీ, డయేరియా, మలేరియా వంటి వ్యాధులపై పలు సూచనలు చేశారు. ఎంపీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది సుశీల, మల్లేశ్వరి, పుణ్యవతి, లలిత, అశోక్, వేణి పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై విచారణకు డిమాండ్



నిరసన తెలుపుతున్న ఆదివాసీ మహాసభ నేతలు

అడ్డతీగల: మండలంలోని అచ్చియ్యపేటకు చెందిన కన్నోజి రాజబాబు రిమాండ్ ఖైదీగా ఇటీవల రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో అనారోగ్యంతో మృతి చెందడంపై జ్యుడీషియల్ విచారణ చేయాలని ఆదివాస మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అరగంటి వీరభద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు అయినాపురపు సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు అచ్చియ్యపేట వెళ్లి మృతుడు రాజబాబు కుటుంబీకులను పరామర్శించి నిరసన చేపట్టినట్టు పేర్కొన్నారు. సీఆర్పీసీ 176(1ఎ) ప్రకారం పోలీసు కస్టడీలోగాని జ్యుడీషియల్ కస్టడీలోగాని ఎవరైనా మరణిస్తే మేజిస్ట్రేట్ విచారణ చేయాలన్నారు. దాన్ని అమలు చేయడంలో విఫలమైన అధికారులపై చర్య లు తీసుకోవాలన్నారు. రాజబాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో ఈ నెల 23న విచారించాల్సి ఉందని, ఈ లోగా మరణించడంపై అనుమానం వ్యక్తం చేశారు. ఆదివాసీ మహాసభ నాయకులు మామిడి చిన్నారెడ్డి, జక్కుల పాండవులు తదితర నేతలు పాల్గొన్నారు.

37,500 అల్బెండజోల్ మాత్రలు పంపిణీకి సిద్ధం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడెంకొత్తవీధి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఈనెల 14న విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. మండలానికి నులిపురుగుల నివారణ కోసం 37,500 మాత్రలు వచ్చాయన్నారు. వీటిని 195 పాఠశాలలు, 203 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వారికి పంపిణీ చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించినట్టు తెలిపారు. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాజవొమ్మంగి: విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు విధిగా వేయాలని వైద్యాధికారులు యామినిప్రియ, లిఖిత, ఉష కోరారు. శనివారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈనెల 14న ఈ మాత్రలను ప్రతి విద్యాలయంలో పిల్లలకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, ఆకలి మందగించడం వంటి సమస్యలు ఏర్పడతాయని సూచించారు. ఎంఈవో తాతబ్బాయిదొర, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



డుంబ్రిగుడ: ప్రచారం చేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ



గూడెంకొత్తవీధి: లక్కవరపేటలో ఎంపీపీ బోయినకుమారి

కొయ్యూరు: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి ఆయా పార్టీల నేతలు ప్రచారాన్ని నిలిపివేశారు. రాజేంద్రపాలెంలో మద్యం షాపును ఎక్సైజ్ అధికారులు మూసి చేశారు. తిరిగి ఎమ్మెల్సీ ఎన్నిక ముగిసిన తర్వాత తెరుస్తారు. 15 రోజుల నుంచి ప్రచారాన్ని అన్ని పార్టీలు ముమ్మరం చేశాయి. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితోపాటు ఎన్నిక కమిటీ సభ్యులు చివరి రోజు ముమ్మర ప్రచారం నిర్వహించారు.

గూడెంకొత్తవీధి: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ బోయిన కుమారి కోరారు. శనివారం లక్కవరపేట, రింతాడ, సంకాడ పంచాయతీల్లో ప్రచారం చేశారు. వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, సర్పంచ్‌లు రామకృష్ణ, వంశీ కృష్ణ, పండు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం గుంటసీమ, రంగిలిసింగి, అరకు, సంతబయలు పంచాయతీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ పట్టభద్రులను కోరారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో శనివారం ఎన్నికల ముగింపు ప్రచారం ముమ్మరంగా చేశారు. సీతగుంట గ్రామ సచివాలయం పరిధి గురుకుల పాఠశాల, ఏకలవ్య, గురుకుల కళాశాల, ఇతర ఆశ్రమ పాఠశాలల్లో పట్టభద్రులను వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వంతాల ఆనందరావు కలిసి ఓటు అభ్యర్థించారు. పార్టీ సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, లంకా సుబ్రహ్మణ్యం, నరంజీ రామారావు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు శనివారం అరకులోయ, కొండవీధి, జెడ్పీ కాలనీ గ్రామాలతోపాటు చిన్నలబుడు, బొండం, సుంకరమెట్ట, పద్మాపురం పంచాయతీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుధాకర్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, సీనియర్ నాయకులు రఘునాథ్, రామారావు, శెట్టి వెంకటరావు, బాబూరావు, శివ, దొన్ను, రంజిత్‌కుమార్, లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆరోగ్య వలంటీర్లను నియమించాలి'

కొయ్యూరు: ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య వలంటీర్లను వెంటనే నియమించాలని సీపీఐ మండల కార్యదర్శి ఇరువాడ దేముడు, రావణాపల్లి ఎంపీటీసీ సత్యవేణి, సీపీఐ జిల్లా నాయకులు దర్శి సతీశ్, సీపీఎం కార్యవర్గ సభ్యుడు అప్పలనాయుడు కోరారు. వారు శనివారం మాట్లాడుతూ ఆరోగ్య వలంటీర్లను తొలగించడం మూలంగా విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించేందుకు అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటి వరకు పది మంది విద్యార్థులు మరణించారని వాపోయారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రులకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మెనూ చార్జీలను, విద్యార్థుల బట్టల కుట్టు కూలికి ఇస్తున్న డబ్బులను పెంచాలని కోరారు.

నేడు సచివాలయాలు తెరిచే ఉంటాయి..

కోటవురట్ల : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కూడా సచివాలయాలు తెరుచుకుంటాయని ఎంపీడీవో చంద్రశేఖర్ శనివారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటాయని, ఎక్కడైనా తెరవకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ఎన్నికల నియమావళి సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, ఎన్నికల ప్రచారం ఎక్కడ జరిగినా చర్యలు తీసుకుంటామన్నారు.